క్లుప్తంగా

సామాజిక మాధ్యమాలతో అప్రమత్తం

భాకరాపేట : సామాజిక మాధ్యమాలతో బాలికలు అప్రమత్తంగా ఉండాలని చంద్రగిరి ఐసీడీఎస్ పీడీ ప్రదీప సూచించారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు స్త్రీ శక్తి భవనంలో కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సామాజిక రుగ్మతల నుంచి బయపడేందుకు కృషి చేయాలని కోరారు. మంచి మార్గం వైపు నడిచేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిడ్డయ్య, తహసీల్దార్ జనార్దన్‌రాజు, ఏసీడీపీఓ జ్యోతి, సుహాసిని పాల్గొన్నారు.

ఎంఈఓ తీరుపై ఆగ్రహం

చంద్రగిరి : ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యల పరిష్కారంలో ఎంఈఓ లలితకుమారి అలసత్వం వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, అక్బర్, ఉపాధ్యక్షుడు తేజ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ సుమారు 8 ఏళ్లుగా చంద్రగిరి ఎంఈఓగా విధులు నిర్వర్తిస్తున్నా, ఒక్క పాఠశాలను కూడా సందర్శించలేదని ఆరోపించారు. బాలికల పాఠశాలలో నాణ్యతలేని మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బడి పక్కనే మురుగు నీటి కాలువ ఉండడంతో పిల్లలు దుర్వాసన భరించలేకపోతున్నారని ఫిర్యాదు చేసినా ఎంఈఓ కనీసం స్పందించలేదని మండిపడ్డారు. ఈ విషయాలను ఇప్పటికే కలెక్టర్, డీఈఓ దృష్టికి తీసుకెళ్లామని, పట్టించుకోకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

రైల్వే కూలీ సంఘం గౌరవాధ్యక్షుడి ఎన్నిక



పోర్టర్ సంఘం నేతలు

తిరుపతి అర్బన్ : తిరుపతి బాలాజీ రైల్వే స్టేషన్‌లోని కూలీలు సంఘం ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం ఈ మేరకు అధ్యక్షుడు షణ్ముఖం నేతృత్వంలో గౌరవాధ్యక్షుడిగా కుప్పాల గిరిధర్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఓబుల్‌రెడ్డి, ఆంజనేయులు, కుమార్, గోవింద్ రాజులు పాల్గొన్నారు.

యాజమాన్యంతో అధిక దిగుబడి

భాకరాపేట : సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాల్ తెలిపారు. సోమ వారం భాకరాపేట, ఎర్రావారిపాళెం రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరిలో సమగ్ర పోషణ, యాజమాన్యం పాటిస్తే ఖర్చులు తగ్గుతాయన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి కేవీ శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడి సాగులో చేపట్టాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలను వివరించారు. వ్యవసాయాధికారులు ఖాదర్‌బాషా, ధనలక్ష్మి మాట్లాడుతూ పంట బీమా ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది మునిశేఖర్, భానుప్రకాష్, రాజశేఖర్, తేజస్విని, జాహ్నవి, నళినిదేవి పాల్గొన్నారు.

11న వడ్డెరల ర్యాలీ



మాట్లాడుతున్న మదన్‌మోహన్

తిరుపతి కల్చరల్ : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతిని పురస్కరించుకుని ఈనెల 11వ తేదీన ర్యాలీ నిర్వహించనున్నట్లు వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు జి.మదన్ మోహన్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్ద జాతీయ పతాకం సర్కిల్ వరకు ర్యాలీ సాగుతుందన్నారు. అనంతరం వడ్డెర ఓబన్న చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే పేదలకు అన్నదానం చేపట్టనున్నట్లు వివరించారు. వడ్డెరలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో సంఘం నేతలు శ్రీనివాసులు, రమణ, నాగరాజు, బాబు, వాసు, జ్యోతి, లక్ష్మణకుమార్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పాకాల సీఐగా సుదర్శన్ ప్రసాద్



పాకాల : స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ సుదర్శన్ ప్రసాద్ మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి వీఆర్ నుంచి ఆయన బదిలీపై పాకాలకు వచ్చారు. సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకే తొలి ప్రాధాన్యమిస్తామని వెల్లడించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ శాంతి దుర్గ

తిరుపతి అర్బన్ : కిశోర బాలికలు పౌష్టికాహారంతోపాటు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తే ఆరోగ్యంగా జీవనం సాగించవచ్చని సీడీపీఓలు సుధారాణి, శాంతి దుర్గ తెలిపారు. మంగళవారం తిరుపతిలోని రాజ్ భవనంలో కిషోర్ వికాసం పథకంపై అవగాహన కల్పించారు. పౌష్టికారం అందించడమే పథకం ఉద్దేశమన్నారు. ఆ దిశగా అంగన్‌వాడీలు కృషి చేయాలని సూచించారు.

నిర్లక్ష్యం



జిల్లాల పునర్విభజన సమయంలో తిరుచానూరు సమీపంలోని టీటీడీకి చెందిన పద్మావతి నిలయంలో కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. ఆధునిక వసతులతో అలరారుతున్న ఈ భవనంలో ఉన్నతాధికారులు కొలువుదీరారు. అయితే ప్రతిష్టాత్మక బిల్డింగ్ పైభాగంలోని శ్రీవేంకటేశ్వరస్వామివారి గోవిందనామం శిథిలావస్థకు చేరినా గమనించలేకపోయారు. పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

తాత్సారం



జిల్లాలో బస్టాండ్ లేని ఆర్టీసీ డిపో ఏదైనా ఉందంటే అది మంగళం మాత్రమే. స్థలం కేటాయించినప్పటికీ నిర్మాణం చేపట్టక తాత్సారం చేస్తూనే ఉన్నారు. ఈ డిపో నుంచి 78 సర్వీసులు నడుస్తున్నా.. బస్టాండ్ లేకపోవడమే కొరతగా మారింది. తిరుపతి నగరం విస్తరించిన నేపథ్యంలో ఈ ప్రాంతంలో బస్సు ప్రాంగణం ఏర్పాటు చేస్తే ప్రయాణికులు సైతం సౌకర్యంగా ఉంటుంది. - తిరుపతి అర్బన్

ఉత్సాహం



రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో వివేకానంద సర్కిల్ నుంచి మంగళవారం జాతీయ సంస్కృత యూనివర్సిటీ విద్యార్థులు యువజనోత్సవ ర్యాలీ నిర్వహించారు. దేశ సేవే లక్ష్యంగా అడుగులు వేస్తామని నినాదాలు చేశారు. స్వామి వివేకానందుడు నిర్దేశించిన మార్గంలో పయనిస్తామని ప్రతినబూనారు. జాతి సమైక్యత కోసం సమష్టిగా చిత్తశుద్ధితో కృషి చేస్తామని స్పష్టం చేశారు. - తిరుపతి సిటీ

వరాలు కురిసె.. వర్సిటీలు మురిసె!



- అధ్యాపకుల నియామకాలపై యూజీసీ నోటిఫికేషన్
- నెట్.. స్లెట్ నిబంధనలు సడలిస్తూ ఉత్తర్వులు
- ఉద్యోగోన్నతుల్లోనూ వెసులుబాటు
- స్థానిక భాషలో పరిశోధన పత్రాల ప్రచురణకు అవకాశం

అధ్యాపకుల నియమాకాల్లో కఠిన నిబంధనలు తొలిగిపోయాయి. ఉద్యోగోన్నతులపై కమ్ముకున్న నీలినీడలు వీడిపోయాయి. పరిశోధక విద్యార్థులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరనున్నాయి. మంగళవారం ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేయడంతో అధ్యాపకుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పోస్టింగ్‌లు.. ప్రమోషన్లకు సంబంధించి సడలింపులతో యూజీసీ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై ప్రశంసలు కురుస్తున్నాయి. – తిరుపతి సిటీ

హర్షణీయం



అఖిల భారతీయ రాష్ట్రీయ షైక్షిక్ మహా సంఘం (ఏబీఆర్ఎస్ఎమ్) ఆధ్వర్యంలో పలు మార్లు యూజీసీకి అధ్యాపక నియామకాలు, ఉద్యోగోన్నతుల నిబంధనలు సడలించాలని వినతి పత్రాలు సమర్పించాం. ఇన్నాళ్లకి యూజీసీ డ్రాఫ్ట్ రెగ్యులేషన్ నోటిఫికేషన్ విడుదల చేయడం హర్షణీయం. దీంతో ఎంతో మంది నిరుద్యోగులు, అకడమిక్ కన్సల్టెంట్లు, శాశ్వత అధ్యాపకులకు మేలు జరుగుతుంది. క్వాలిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు అందే అవకాశం ఉంటుంది. అధ్యాపకుల కొరత సమస్యలకు కొంత వరకు పరిష్కారం లభించినట్లే.

– ప్రొఫెసర్ రామిరెడ్డి, ఏబీఆర్ఎస్ఎమ్ రాష్ట్ర అధ్యక్షుడు, తిరుపతి

ఎంతో మందికి ఉపయోగకరం



యూజీసీ మంగళవారం విడుదల చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో అధ్యాపక పోస్టుల నియామకాలలో స్లెట్, నెట్ ప్రామాణికం కాదంటూ నిబంధనలను సవరించడం సంతోషకరం. ఎంతో మంది నిరుద్యోగులకు, పీహెచ్‌డీ విద్యార్థులకు ఇదో శుభవార్తగా చెప్పవచ్చు. ఏళ్ల తరబడి నెట్, సెట్ల్ పరీక్షలకు హాజరవుతూ ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారికి కాస్త ఉపశమనం లభించినట్లే. అధ్యాపకుల ప్రమోషన్ విషయంలో యూజీసీ మంచి నిర్ణయం తీసుకుంది.

– ప్రొఫెసర్ సి.వాణి, పద్మావతి మహిళా వర్సిటీ, తిరుపతి

వరం లాంటింది



పీహెచ్‌డీ స్కాలర్స్‌కు యూజీసీ డ్రాఫ్ట్ రెగ్యులేషన్ నోటిఫికేషన్ వరంలా భావించవచ్చు. వ్యయప్రయాసల కోర్చి పీహెచ్‌డీ పూర్తి చేసినా నెట్, స్లెట్ ప్రామాణికంగా నియామకాలు ఉండేవి. అలాంటి నిబంధనలను తొలగించడం హర్షణీయం. దీంతో పాటు కాంట్రాక్ట్ అధ్యాపకులకు మరిన్ని సదుపాయాలను కల్పించాలంటూ ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరం. స్థానిక భాషలో పరిశోధన పత్రాల ప్రచురణ చేసుకునే సౌలభ్యం ఇవ్వడంతో పరిశోధకలకు ఎంతో ఉపశమనం లభించింది.

– డాక్టర్ బుల్బీ దాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్‌యూ

పబ్లికేషన్స్‌లో వెసులుబాటు



పరిశోధనల విషయంలో క్వాలిటీని ప్రామాణికంగా తీసుకోవాలని, పబ్లికేషన్స్ మ్యాండెటరీ కాదనే విషయాన్ని యూజీసీ స్పష్టంగా చెప్పడం ఊరటనిచ్చే అంశం. పరిశోధక విద్యార్థులకు యూజీసీ నిబంధనల సడలింపుతో కాస్త ఉత్సాహం వస్తుంది. పీహెచ్‌డీ మాత్రమే ప్రామాణికంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం జరిగేలా ఉత్తర్వులు ఇవ్వడం శుభపరిణామం. ప్రమోషన్ల విషయంలో 12ఏళ్ల సర్వీసును 8ఏళ్లకు కుదించడం శాశ్వత ఉద్యోగులు మంచిది.

– ప్రొఫెసర్ రాజశేఖర్, జువాలజీ విభాగం, ఎస్వీయూ

ఇదో శుభవార్త



యూజీసీ వెలువరించిన నిబంధనలు ఉద్యోగార్థులు, శాశ్వత అధ్యాపకులకు గుడ్ న్యూస్‌గా చెప్పవచ్చు. పదోన్నతుల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదు రు చూస్తున్న అధ్యాపకుల కు ఇదో శుభవార్త. దీంతో పాటు పరిశోధనా పత్రా లు స్థానిక భాషలో ప్రచురించుకోవచ్చనే సడలింపు విద్యార్థులకు, పరిశోధకులకు ఊరటనిచ్చే అంశం. పీహెచ్‌డీ ప్రామాణికంగా అధ్యాపక పోస్టుల నియామకాలు జరపడం మంచి నిర్ణయం.

– ప్రొఫెసర్ రమేష్, సంస్కృత వర్సిటీ, తిరుపతి

వేతనం పెంపునకు డిమాండ్

పాకాల : ఆశ వర్కర్లకు వేతనం పెంచాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం దామలచెరువు పీహెచ్‌సీలో ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు. జనరల్ బాడీ మండల కన్వీనర్ ప్రసాద్ మాట్లాడుతూ ఆశాలకు రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు లక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

రామచంద్రాపురం: మండలంలో డిసెంబర్ 6 నుంచి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు మంగళవారం అనుప్పల్లెలో చేపట్టిన సదస్సుతో ముగిశాయి. తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ మొత్తం రెవెన్యూ సదస్సులలో 241 వినతులు వచ్చాయని, 58 పరిష్కరించామని వెల్లడించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ విడుదల చేస్తున్న డీఈఓ

తిరుపతి అర్బన్: పూలే టీచర్స్ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీఈఓ కేవీఎన్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీటీఎఫ్ నేతలు మల్లేశ్వర్, హరి, కిషోర్, మేష్, మురళి, శంకరయ్య, హరిబాబు, పుణ్యప్రసాద్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి మేళా రేపు

తిరుపతి తుడా : కచ్చపి ఆడిటోరియంలో గురువారం మెప్మా ఆధ్వర్యంలో స్వయం ఉపాధి మేళా నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మేళాలో హోమ్ అప్లయెన్స్‌స్, ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, వాటర్ ప్యూరిఫైయర్, గీజర్ మరమ్మతులు, వృతి సంబంధిత సేవలు, బ్యూటీషియన్ కోర్సుల్లో పురుషులు, స్త్రీలకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

భోజనంలో నాణ్యత తప్పనిసరి



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న డీవైఈఓ బాలాజీ

చంద్రగిరి: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని డీవైఈఓ బాలాజీ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక పద్మావతి బాలికోన్నత పాఠశాలను ఎంఈఓ భాస్కర్ బాబుతో కలసి సందర్శించారు. వంటశాల, ఆహార పదార్థాల తయారీ విధానం, బడి పరిసరాలను పరిశీలించారు. డీవైఈఓ మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం సిద్ధం చేసి విద్యార్థులకు వడ్డించాలని ఆదేశించారు. వంటలో వినియోగించే సరుకులు నాణ్యంగా ఉండాలని సూచించారు. ఈక్రమంలోనే గ్యాస్ స్టవ్ మాత్రమే వాడాలని, కట్టెల పొయ్యిని వినియోగించకూడదని స్పష్టం చేశారు. భోజనం తయారీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే శనివారం అస్వస్థతకు గురైన 23 మంది విద్యార్థులను పరామర్శించారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వివేకానందుని జయంతి



వివేకానందుని విగ్రహం వద్ద విద్యార్థులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : స్వామి వివేకానంద ఆదర్శనీయులని, నేటి యువతకు స్ఫూర్తిప్రదాత అని వక్తలు కొనియాడారు. మంగళవారం రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద, శారదామాత, రామకృష్ణ తదితరుల వేషధారణతో విద్యార్థులతో కలిసి ఎస్వీ మెడికల్ కళాశాల వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం వివేకానందుని విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద మాట్లాడుతూ తన ప్రసంగాలు, రచనల ద్వారా వివేకానందుడు యువతకు మార్గనిర్దేశం చేశారన్నారు. భారతీయ విద్యాభవన్ సంచాలకుడు ఎస్.సత్యనారాయణ రాజు, ఆయుర్వేద వైద్యుడు పి.మురళీకృష్ణ, ఆచార్య పీవీ రెడ్డి మాట్లాడుతూ వివేకానందుని భోధనలను వివరించారు. స్వామి సత్యస్థానంద ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపించారు.

అన్నా క్యాంటీన్ల తనిఖీ



భోజనం రుచి చూస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: నగరంలోని స్విమ్స్ కూడలి, న్యూ బాలాజీ కాలనీ, ఎమ్మార్‌పల్లె, ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్లను కార్పొరేషన్ కమిషనర్ మౌర్య మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. అధికారులు, సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ మహేష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల ఎంపిక

కదలలేని స్థితిలో మంచానికి, కుర్చీకి పరిమితమైన పెన్షనర్ల ఎంపికను కమిషనర్ మౌర్య పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పక్షవాతం, ఏదైనా ప్రమాదంతో 80 శాతం వికలత్వం ఉన్న వారికి రూ.15వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆ మేరకు లబ్ధిదారులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో 52 మందిని గుర్తించినట్లు వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య పాల్గొన్నారు.

'వ్యాస రచన' విజేతలకు బహుమతులు



విజేతలతో అతిథులు, ఉపాధ్యాయులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన గురజాడ అప్పారావు జీవిత విశేషాలపై వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మంగళవారం ఈ మేరకు స్థానిక టీపీపీఎం నగర పాలక ఉన్నత పాఠశాలలో చేపట్టిన ప్రదానోత్సవంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ యుగంధర్ చేతులమీదుగా విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. యుగంధర్ మాట్లాడుతూ తెలుగు భాష, జాతి అభ్యున్నతికి గురజాడ అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళావేదిక వ్యవస్థాపకుడు అరవ జయపాల్, పాఠశాల హెచ్ఎం ఆనంద్ పాల్గొన్నారు.

పది పరీక్షలపై దిశానిర్దేశం



మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల : దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో ఎంఈఓ బాబ్జీ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఇన్‌చార్జి హెచ్ఎం హేమలత పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూలో పీజీ సెట్ నోటిఫికేషన్

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీ సెట్ నోటిఫికేషన్ మంగళవారం విడుదలైంది. యూనివర్సిటీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఫిబ్రవరి 2వ తేదీలోపు విద్యార్థులు సమర్పించాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు వెల్లడించారు.

సంకల్పంతో ఉజ్వల భవిష్యత్

తిరుపతి కల్చరల్ : సంకల్ప బలంతో ఉజ్వల భవిష్యత్ సాధించవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణులు తెలిపారు. మహతి కళాక్షేత్రంలో డాలర్స్ గ్రూప్ సహకారంతో మెగా ఇంపాక్ట్ వారి ఆధ్వర్యంలో చేపట్టిన వ్యక్తిత్వ వికాస సదస్సు మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. కార్పొరేషన్ కమిషనర్ మౌర్య డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్‌రెడ్డిజ్యోతి ప్రజ్వలన చేశారు. కమిషనర్ మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకుని నిరంతరం ప్రయత్నించి ఐఏఎస్ అధికారిగా ఎదిగానని తెలిపారు. భవిష్యత్‌పై యువతకు దిశానిర్దేశం చేసేందుకే వ్యక్తిత్వ వికాస సదస్సు చేపట్టినట్లు వెల్లడించారు. గంపా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమను తాము సంస్కరించుకుని ఉన్నత లక్ష్యాల సాధనతో ఎదగాలని సూచించారు. ఐఏఎస్ ట్రైనర్ బాల లత మాట్లాడుతూ సంకల్పం ఉంటే సాధించలేనిది లేదన్నారు. వేణు కల్యాణ్ మాట్లాడుతూ లక్ష్యాల సాధనలో అనుసరించాల్సిన మార్గాలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మెగా ఇంపాక్ట్ కన్వీనర్ నడ్డినారాయణ, తహసున్నీసా బేగం, విభీషణ శర్మ పాల్గొన్నారు.

అస్తవ్యస్తం

లీలామహల్ కూడలిలో..



మహిళ పోలీస్ స్టేషన్ సమీపంలో..



అలిపిరి ప్రధాన రహదారిపై..



రైల్వే స్టేషన్ రోడ్డులో ..



ప్రతిష్టాత్మక తిరుపతికి నిత్యం దేశవిదేశాల నుంచి యాత్రికులు వచ్చి వెళుతుంటారు. ఈ నేపథ్యంలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు నగరంలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చారు. అయితే చాలాచోట్ల నిఘా నేత్రాలు పనిచేయకపోవడంతో లక్ష్యం నీరుగారిపోతోంది. లక్షలాది మంది రాకపోకలు సాగించే ఆధ్యాత్మిక క్షేత్రంలో అస్తవ్యస్తంగా మారిన కెమెరా వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా పోలీసు సిబ్బంది చర్యలు చేపట్టడం లేదని ప్రజానీకం విమర్శలు గుప్పిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీసీ కెమెరాల తీరుతెన్నులపై దృష్టి సారించాలని కోరుతోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

